క్లుప్తంగా

వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు



పెదవేగి ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో సమావేశం

పెదవేగి : వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా గ్రామ కార్యదర్శులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పెదవేగి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ సూచించారు. బుధవారం అన్ని గ్రామాల కార్యదర్శులు, సచివాలయ గ్రేడ్ 5 కార్యదర్శులతో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ముందుగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వే 95 శాతానికి పెంచాలని, వేసవిలో నీటి ఎద్దడిని అధిగమించేందుకు ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలను అనుసరించి ఫ్లెక్సీలను తొలగించాలని, లేనిపక్షంలో వాటిపై బరకాలు కప్పాలని సూచించారు. ప్రతి సచివాలయం పనిదినాల సమయంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సమస్యలపై స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు.

విఘ్నేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



సింగవరం విఘ్నేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

దెందులూరు: సింగవరంలో బుధవారం విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

దండు మారెమ్మ జాతర



అమ్మవారి ఆలయం వద్ద ఆసాదుల గరగల సేవ

గణపవరం: గణపవరం ప్రాంత ప్రజల ఆరాధ్యదైవం దండు మారెమ్మ జాతర మహోత్సవాలు బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. గణపవరం పరిసర గ్రామాలకు చెందిన వేలాది భక్తులు జాతర సందర్భంగా నిర్వహించిన గవళ్ల గుడుపు సేవలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. బుధవారం రాత్రి అమ్మవారికి ఆసాదులు గరగల సేవతో అమ్మవారి గవళ్లగుడుపు ఉత్సవాలను ప్రారంభించారు. అమ్మవారిని గ్రామంలో వీధివీధినా తెల్లవార్లు ఊరేగిస్తారు. బ్యాండు మేళాలు, తీన్‌మార్ వాయిద్యాలు, నృత్యాలు, విచిత్ర వేషాలు, డప్పులు, శక్తివేషాలు, తప్పెటగుళ్లు, బాణసంచా కాల్పులతో అమ్మవారిని గ్రామంలో వీధివీధినా ఊరేగించారు. ఉత్స వాల సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో చలువ పందిర్లువేసి, రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారికి పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాలు ఈనెల 8వ తేదీ వరకూ నిర్వహిస్తామని కమిటీ ప్రకటించింది.

ఆరు నెలల కోర్సును సద్వినియోగం చేసుకోవాలి

దెందులూరు: ఏవియేషన్, హాస్పిటాలిటీ, కస్టమర్ సర్వీస్ రంగాల్లో మంచి ఉపాధి అవకాశాల కోసం నూరు శాతం ప్లేస్‌మెంట్ కోసం ఏలూరులో నిర్వహిస్తున్న ఆరు నెలల కోర్సును నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పదో తరగతి నుంచి డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ యువకులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం సెల్ 7901344888 నంబరును సంప్రదించాలన్నారు.

జగనన్న భూ సర్వే ప్రారంభం

పెదపాడు: జగనన్న భూ సర్వే- భూ హక్కు సర్వే మండలంలోని బుధవారం నుంచి ప్రారంభమైనట్లు పెదపాడు మండల రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు, సర్వేయర్ కోదండరామ్ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరులో రీ సర్వే ప్రారంభించారు. బుధవారం నుంచి 5రోజుల పాటు డ్రోన్ సహాయంతో భూ సర్వే నిర్వహిస్తామన్నారు. ఆర్‌ఐ రవిచంద్ర, వీఆర్వోలు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పెదపాడు: పంట పొలాల్లో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పెదపాడు పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. మండలంలోని వేంపాడు గ్రామానికి చెందిన కట్నేని విజయలక్ష్మితేజ (37) మిలటరీ పనిచేసి రిటైర్ అయిన తరువాత తండ్రితోపాటు ఒంటరిగా ఉంటున్నాడు. దీంతో మనస్తాపానికి గురై బుధవారం ఉదయం ఆత్మహత్య పాల్పడ్డాడు. అటుగా వెళ్లిన వారు చూసి సమాచారం ఇవ్వడంతో పెదపాడు ఎస్సై బీ నాగాబు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలుష్య కాసారం... వెంకయ్య కాలువ

- మూడు నియోజకవర్గాల్లోని రైతులకు సాగునీటి వనరు
- 50 గ్రామాల ప్రజలకు తాగునీరు
- ప్రత్యేక వాటర్ గ్రిడ్ పథకం కాలువ ప్రక్షాళనకు దోహదం



వెంకయ్యకాలువ పొడవునా కాలుష్యానికి కారణమవుతున్న వరాహాలు



వయ్యేరులోకి చేరుతున్న మురుగునీరు



కాలువ ఒడ్డునే డంపింగ్ యార్డు

గణపవరం: మూడు నియోజకవర్గాల్లోని 50 గ్రామాలకు తాగు, సాగునీరందించే వెంకయ్య కాలువ కాలుష్య కాసారంగా మారింది. ఈ కాలువలో నీరు ఎట్టి పరిస్థితుల్లోనూ తాగడానికి వినియోగించ రాదని రెండు దశాబ్దాల క్రితమే ఈ నీటిని పరీక్షించిన ఢిల్లీకి చెందిన నిపుణుల బృందం హెచ్చరించారు. పెంటపాడు, గణపవరం, నిడమర్రు, ఉండి, ఆకివీడు, కాళ్ల మండలాల్లోని పలు గ్రామాలకు నేటికీ ఈ కాలువనీటినే తాగేందుకు ఉపయోగిస్తున్నారు. ఈ కాలువను ప్రక్షాళనకు ఎన్నో ప్రతిపాదనలు సిద్ధం చేసినా కార్యరూపం దాల్చలేదు. 1990 అప్పటి అత్తిలి ఎమ్మెల్యే దండు శివరామరాజు ఈ కాలువను రెండు భాగాలుగా చేయాలని ఒకటి మురుగు కాలువగా, రెండో భాగం పంట కాలువగా విభజించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించినా ఆచరణలోకి రాలేదు. 1999లో దేవదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన శివరామరాజు ఈ కాలువ ప్రక్షాళనకు పలు ప్రతిపాదనలు చేశారు. కాలువ మధ్య భాగంలో ఫిల్లర్ల మీద సిమెంట్ తొట్టె నిర్మించి మంచినీటి సరఫరా చేయాలని ప్రతిపాదనలు చేసినా వాటికి మోక్షం కలుగలేదు.

వైఎస్సార్ హయాంలో రూ.30 కోట్లు మంజూరు

అనంతరం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2006లో గణపవరం వచ్చిన సందర్భంగా ఈ కాలువ దుస్థితిని స్థానిక నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వైఎస్సార్ పెంటపాడు మండలం పరిమెళ్ల లాకుల వద్ద నుంచి ఈ కాలువ వెంబడి ప్రత్యేక పైపులైను నిర్మించి ఆయా గ్రామాలకు స్వచ్ఛమైన మంచినీరు అందించేందుకు రూ.30 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో నిర్మాణ పనులు 70 శాతం పూర్తికాగా, అనంతరం ఆయన మరణంతో ఈ పథకానికి గ్రహణం పట్టింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ రూ.3వేల కోట్లతో ప్రత్యేక వాటర్ గ్రిడ్ పథకాన్ని ప్రకటించారు. ఈ పథకం నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవల శ్రీకారం చుట్టడంతో వెంకయ్య కాలువ కాలుష్యం నుంచి విముక్తి లభిస్తుందని ఈ ప్రాంత వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మురుగు నీరు వెంకయ్య కాలువలోకి

పెంటపాడు మండలం పరిమెళ్ల లాకుల వద్ద నుంచి గణపవరం, ఆకివీడు, నిడమర్రు, ఉండి, కాళ్ల మండలాల్లో ప్రవహించే వెంకయ్య కాలువ గణపవరం వరకూ మురుగు కాలువగా, ఆకివీడు, కాళ్ల మండలాలకు పంట కాలువగా ఉపయోగపడుతుంది. దీనితో గణపవరం, నిడమర్రు, పెంటపాడు మండలాల్లోని మురుగు అంతా ఈ కాలువలో కలుస్తోంది. ఈనీరే కింది మండలాల ప్రజలు తాగునీటిగా ఉపయోగిస్తున్నారు.

అన్ని వ్యర్థాలు కాలువలోకే

వెంకయ్యకాలువలో కలిసే మురుగు, చెత్తా చెదారాలను చూస్తేనే ఒళ్లు జలదరిస్తుంది. ఈ నీరు తాగడానికి కాదు కదా, కనీసం వాడకానికి ఉపయోగించాలన్నా ఆలోచించాల్సిందే. పైనున్న పొలాల్లోని వేలాది ఎకరాల్లోని మురుగు నీరు, చేపల చెరువుల్లోని కలుషిత నీరు, గణపవరంలోని అన్ని డ్రెయిన్ల మురుగు నీరు ఈ వెంకయ్య కాలువలోకే వస్తోంది. కాలువ వెంబడి ఉన్న ఇళ్లలోని వారు వాడకం నీరు, లెట్రిన్ గొట్టాల వ్యర్థ జలాలను కూడా ఈ కాలువలోకే వదులుతున్నారు. కాలువ వెంబడి రోజూ వందల సంఖ్యలో పందులు దొర్లాడుతూ కాలుష్యాన్ని పెంచుతున్నాయి. కాలువ వెంబడి గ్రామాల్లోని చెత్తాచెదారం తీసుకువచ్చి వెంకయ్యకాలువ గట్ల వెంబడి వేయడంతో ఆ వ్యర్థాలు కాలువలోకి జారడంతో నీరంతా కాలుష్యమయంగా మారుతోంది.

బొబ్బిలి వంతెన వద్ద డంపింగ్ యార్డు

నిత్యం జన సమ్మర్దంగా ఉండే బొబ్బిలి వంతెన ప్రాంతాన్ని డంపింగ్ యార్డుగా మార్చివేశారు. గణపవరంలో ఉండే కాఫీ హోటళ్లు, భోజన హోటళ్లలోని వ్యర్థాలన్నీ బొబ్బిలి వంతెన మీద నుంచి కాలువలోకి వేస్తున్నారు. పండ్ల వ్యాపారులు, తోపుడు బళ్ల వ్యాపారులు సైతం పాడయిన పండ్లు, కూరగాయలను వంతెన మీది నుంచి కాలువలోకి విసిరేస్తున్నా పట్టించుకునే నాథుడులేడు. రోజూ ఈ వ్యర్థాలను వంతెన మీదుగా వేయడంతో రైలింగ్ కూడా శిథిలమై కూలిపోయింది.

పరిశ్రమల వ్యర్థాలు ఈ కాలువలోకే

కాలువ వెంబడి ఉన్న పలు రైస్ మిల్లులు, అట్టల పరిశ్రమ నుంచి వ్యర్థాలను ఈ కాలువలోకి వదిలేస్తుంటారు. చేపలు, రొయ్యల చెరువులను పట్టివేసే సమయంలో ఆ కలుషిత నీరు మొత్తం వెంకయ్య కాలువలోకే చేరుతోంది. ఇతర ప్రాంతాల్లోని సుగర్ ఫ్యాక్టరీలకు చెందిన రసాయనాలతో కూడిన వ్యర్థ జలాలు అనేకసార్లు ఈ కాలువలో నురగలతో దర్శనమిస్తుంది. ఇన్ని రకాలుగా కాలుష్యం బారిన పడిన ఈ కాలువ ప్రక్షాళనకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

క్యాంపస్ ఎంపికలో 11మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో డిగ్రీ కాలేజ ప్రిన్సిపల్ నిర్మల

గణపవరం: గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో బుధవారం నిర్వహించిన ఉద్యోగ మేళా క్యాంపస్ ఎంపికలో ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి తెలిపారు. ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. అపోలో ఫార్మసీ, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికలకు సుమారు 50 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెకేసీ కోఆర్డినేటర్ పి.మధురాజు, నాక్ కోఆర్డినేటర్ టి.అక్కిరాజు, జెకేసీ మెంటార్ ఐవీఎల్ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం కావాలి

దెందులూరు: జగనన్న ఇళ్ల లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేయాలని దెందులూరు ఎంపీడీఓ ఏబీపీపీ లక్ష్మి అన్నారు. బుధవారం సోమవరప్పాడు సచివాలయంలో మాజీ సర్పంచ్ సరిగే నాగరాజు అధ్యక్షతన గృహనిర్మాణ శాఖ ఏఈ కావ్య, ఏపీఎం వేణుగోపాల్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, రోడ్లు నిర్మిస్తున్నట్టు తెలిపారు. లబ్ధిదారులంతా ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. వార్డుల వారీగా ఇళ్ల నిర్మాణ ప్రగతిని హౌసింగ్ ఏఈ, వలంటీర్లతో సమీక్షించారు.

గృహసారథులు.. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు



మొయ్యేరు సమావేశంలో మాట్లాడుతున్న వాసుబాబు



సమావేశంలో పాల్గొన్న గృహసారథులు, కన్వీనర్లు, పార్టీ శ్రేణులు

గణపవరం: గృహసారథులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం సాయంత్రం గణపవరం మండలం మొయ్యేరులో మొయ్యేరు, ముప్పర్తిపాడు, కోమర్రు, డి.కుముదవల్లి, కాశిపాడు, కొందేపాడు గ్రామాలకు చెందిన గృహ సారథులు, వలంటీర్లు, పార్టీ శ్రేణుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో వారికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ఎంత మంచి చేసినా కుట్రపూరితంగా విష ప్రచారం చేస్తున్న పచ్చమీడియా ఆరోపణలను గృహ సారథులు తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాన్ని వివరించి, వారి మద్దతు కోరాలని సూచించారు. వచ్చే ఎన్నికలలో అధికారంలోకి రాకపోతే ఇక భవిష్యత్తు ఉండదన్న ఆందోళనతో తెలుగుదేశం, దాని తోక మీడియా ఎన్ని దారుణాలకైనా దిగజారుతున్నాయని, ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయడం వల్లనే 151 స్థానాలతో తిరుగులేని మెజార్టీతో అధికారంలోకి వచ్చామని, వచ్చే ఎన్నికలలో మరింత ఉత్సాహంతో పనిచేసి తిరిగి అంతకుమించిన సీట్లతో వైఎస్ జగన్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థలు ప్రజలకు పరిపాలనను పూర్తి అందుబాటులోకి తెచ్చాయన్నారు. వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు వారధులైతే, గృహ సారథులు పార్టీకి, ప్రజలకు మధ్య వారధులని అన్నారు. అందువల్ల గృహసారథులపై గురుతరమైన బాధ్యత ఉందన్నారు. దేశంలో కులం, మతం, వర్గం, ప్రాంతం, పార్టీ తేడాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక నాయకుడు సీఎం జగన్ అని అన్నారు. ప్రతి గ్రామ సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు, వారికి ఒక మండల కన్వీనర్లను ఏర్పాటు చేశామన్నారు. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి ఆ కుటుంబానికి ఏఏ పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో వివరించాలని, మార్చి 18 నుంచి 25వ తేదీ వరకూ గృహసారథులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందించే పథకాలను వివరించడంతో పాటు, మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమంలోని అంశాలు వివరించాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో గణపవరం ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మిబాబులు, మొయ్యేరు సర్పంచ్ దుళ్ల కుటుంబరావు, ఎంపీటీసీ సభ్యురాలు ద్వారంపూడి విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి దండు సూరిబాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గంటా పద్మాజీ రావు, సొసైటీ అధ్యక్షుడు ఈదర అశోక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.

అమర వీరుల ఆశయ సాధనకు కృషి



నాగన్నగూడెంలో మాదిగ సంస్మరణ సభ నిర్వహిస్తున్న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ఎఫ్ నేతలు

పెదవేగి : బీజేపీ ప్రభుత్వం ఎనిమిదేళ్లుగా మాదిగలను ఘోరంగా మోసం చేస్తోందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. దెందులూరు నియోజకవర్గ ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో పెదవేగి మండలం నాగన్నగూడెంలో మాదిగ అమర వీరుల సంస్మరణ సభ బుధవారం జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగాల శేఖర్ మాట్లాడుతూ గడచిన 28 ఏళ్ల కాలంలో ఎంఆర్‌పీఎస్ ఉద్యమ పోరుబాటలో ఎందరో అమరులయ్యారని, వారి ఆశయ బాటలో ఎస్సీ వర్గీకరణ సాధించేవరకు పోరాడతామన్నారు. ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ఎఫ్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మద్దాల తిరుపతిరావు మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆలోచనలో భాగంగా ఎస్సీ ఏ,బీ,సీ,డీ వర్గీకరణ పోరులో అమరులైన త్యాగమూర్తుల ఆశయాలను కొనసాగిస్తామని చెప్పారు. మార్చి 15 నాటికి అమరావతిని ముట్టడించి మా సత్తా ఏమిటో నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కె మురళీకృష్ణ, చొదిమెళ్ళ వీరయ్య, కొండపల్లి బుజ్జి, చొదిమెళ్ళ ప్రసాద్, సొంగా సోమయ్య, పాల్గొన్నారు.

డాక్టర్ ప్రీతికి కొవ్వొత్తులతో నివాళులు

దెందులూరు: భవిష్యత్తులో ఆడపిల్లలపై అఘాయిత్యాలు జరగకుండా ఉండేందుకు చట్టాలను కఠినతరం చేయాలని బీఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బీ.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం నాగులదేవునిపాడు బీఎస్ఆర్ ఫౌండేషన్ కార్యాలయంలో మృతి చెందిన డాక్టర్ ప్రీతి చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఆమె మృతికి కారకులైన వారిని యావజ్జీవ కారాగార శిక్ష వేయాలని డిమాండ్ చేశారు. కోర్టులు జోక్యం చేసుకుని నేరుగా దర్యాప్తుకు ఆదేశించాలన్నారు. బీఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా సంతకాల సేకరణ చేస్తున్నామని, ప్రీతి కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడతామన్నారు. తాము సేకరించిన సంతకాల జాబితాను రాష్ట్ర గవర్నర్‌కు త్వరలో అందజేస్తామన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

పెదవేగి : భార్య మృతిపై మనస్తాపం చెందిన ఓ భర్త పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఘటన స్థానికంగా తీవ్ర కలవరాన్ని సృష్టించింది. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం కొప్పాక గ్రామానికి చెందిన నంగెడ్ల రాయుడు (35) అతని భార్య మౌనిక కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా, తీవ్ర మనస్తాపానికి గురైన రాయుడు అలియాస్ (రాము) సోమవారం తన ఇంటిలో ఉన్న పురుగు మందు తాగాడు. ఈ విషయాన్ని స్థానికులు గమనించి హుటాహుటిన ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్య చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి రాయుడు చనిపోయాడని అందిన ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారని ఎస్సై చెప్పారు.

దోమలతోనే వ్యాధుల వ్యాప్తి



నీటితొట్టెలో పెరుగుతున్న దోమలపై అవగాహన కల్పిస్తున్న మలేరియా లక్ష్మణరావు, సిబ్బంది

గణపవరం: అన్ని వ్యాధులకు మూలం దోమలేనని, దోమల నివారణతో వ్యాధులకు దూరంగా, ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చునని తాడేపల్లిగూడెం డివిజన్ మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. బుధవారం ఆయన వైద్య సిబ్బందితో కలిసి గణపవరం మండలం కాశిపాడు, చిలకంపాడులో దోమల వ్యాప్తి, నివారణ, దోమల నుంచి రక్షణ తదితర అంశాలపై ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు అవగాహన కల్పించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం చేకూరుతుందని అన్నారు. ఇంటింటికీ తిరిగి అపరిశుభ్రత, దోమల వ్యాప్తి, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లోని మురుగు నీటి కుంటలు, నీరు నిల్వ చేసే తొట్టెలు, పాత సామాన్లు, కొబ్బరి బొండాలు, రుబ్బు రోళ్ల వంటి వాటిలో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. అలాంటి వస్తువులు ఇళ్ల ఆవరణలో ఉండకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్యదర్శి సౌజన్యకు సత్కారం



పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో సౌజన్యను సత్కరిస్తున్న దృశ్యం

పెదవేగి : విధుల నిర్వహణతోపాటు క్రీడల్లో చక్కటి నైపుణ్యత ప్రదర్శించిన ఉద్యోగిని సౌజన్య భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పెదవేగి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ ఆకాంక్షించారు. పెదవేగి మండలం విజయరాయి గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న సౌజన్య క్రీడల్లోనూ ప్రతిభను చాటుకున్నారు. ఇటీవల నిర్వహించిన అంతర్రాష్ట్ర హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొన్న సౌజన్య టీమ్ ఉత్తమ ప్రతిభతో విజయం సాధించి టోర్నమెంట్ కప్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పెదవేగి ఎంపీడీఓ జి రాజ్ మనోజ్, బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఓ కేవీ జాన్సన్, అన్ని గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వామివార్ల కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు

భీమడోలు: గ్రామంలో వేంచేసియున్న పార్వతీ సమేత భీమేశ్వర స్వామి, వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఆలయ ఉత్సవ కమిటీ, దేవదాయ ధర్మదాయ శాఖల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. ఆలయాలను సుందరంగా ముస్తాబు చేసారు. విద్యుద్దీపాలతో అలంకరించారు. ఏటా ఇద్దరు స్వామి వార్లకు ఒకే వేదికపై కల్యాణాన్ని నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ నెల 3వ తేదీ శుక్రవారం ఆలయాల్లో ధ్వజారోహణ, 4న బలిహరణ, ఈనెల 5న మండపాల వద్ద కల్యాణం, ఈనెల 6న గ్రామోత్సవం, ఈనెల 7న త్రిశూల దర్శనం, పుష్పోత్సవ ధ్వజావరోహణ వంటి కార్యక్రమాలతో ఉత్సవాలు ముగియనున్నాయి.

వైభవంగా ఉమాసోమనాథేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ



చింతాయిగూడెంలో సోమనాథేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే వాసుబాబు



ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: వెల్లమిల్లి పంచాయతీ చింతాయిగూడెంలో నిర్మించిన ఉమా సోమనాథేశ్వరస్వామి ఆలయంలో విజయగాయత్రి శివాలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా బుధవారం నిర్వహించారు. ప్రతిష్ఠాపకులు వెంపరాల హరిశర్మ, విజయలక్ష్మి దంపతులు విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్నారు. వేద మంత్రోచ్ఛరణ నడుమ పూజలు చేశారు. గత నెల 25 నుంచి విగ్రహ ప్రతిష్ఠ పూజలు వివిధ రకాల క్రతువులు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి స్థలాన్ని ముళ్ళపూడి కృష్ణమోహన్ భార్య వెంకటలక్ష్మి అందజేశారు. బుధవారం ఉదయం 7గంటలకు ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు పూర్ణకుంభంతో ఆలయ కమిటీ సభ్యులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. వేదమంత్రోచ్ఛరణతో వాసుబాబుకు స్వాగతం పలికారు. ఉమారామలింగేశ్వరస్వామిని ఆయన దర్శించుకున్నారు. ఈయన వెంట సర్పంచి వత్సకుమారరాజు, ఉప సర్పంచి నాగు, వైసీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, గ్రామ వైసీపీ నాయకలు వాసుబాబు వెంట ఉన్నారు. అనంతరం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు వచ్చి ఈ పూజల్లో పాల్గొన్నారు.

ఇంటింటికీ పింఛన్ల పంపిణీ



పెదపాడులో పింఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ కోఆర్డినేటర్లు, స్థానిక నాయకులు

పెదపాడు: అర్హులైన ప్రతి కుటుంబానికి పథకాలు అందించడమే లక్ష్యమని పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, మండల సచివాలయ కోఆర్డినేటరు అక్కినేని గోపీ చంద్ర దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని పెదపాడులో సచివాలయ కోఆర్డినేటర్లు గృహసారథులు ఇంటింటికీ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా పెదపాడులో పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం కుల మత పార్టీ వర్గ బేధాలు లేకుండా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేసేందుకు ఇంటింటికీ వెళ్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు రెడ్డి స్వర్ణకుమారి, స్థానిక నాయకులు కొల్లేరు మురళీ, కొత్తూరు విమలారావు, పేర్రాజు, నాగేంద్ర, రమేష్ పాల్గొన్నారు.

దెందులూరు: మండలంలో గ్రామాల్లో బుధవారం వైఎస్సార్ పెన్షన్లు పంపిణీ చేశారు. దెందులూరులో లబ్ధిదారులు రాగోలు రాముకు దెందులూరు వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, వలంటీర్ సత్యకుమారి, గృహసారథి పీ.ప్రసన్న, సచివాలయం-1 కన్వీనర్ దనికొండ దుర్గారావు పెన్షన్ నగదును అందజేశారు. గ్రామంలో ఇతర వార్డుల్లో మండల జగనన్న సచివాలయాల కన్వీనర్ కట్టా ఏసుబాబు, సొసైటీ అధ్యక్షుడు కొలుసు గణపతిరావు, జిల్లా నాయకులు చల్లా మేరీరాజు, కొంగర రత్నకుమార్ అబ్బాస్, వన్నెకూటి సుందరం, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు పెన్షన్ నగదును పంపిణీ చేశారు. పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ ఏబీపీపీ లక్ష్మి పర్యవేక్షించారు.

90 శాతం పింఛన్ల పంపిణీ

నిడమర్రు: మండలంలో 90శాతం వైఎస్సార్ పింఛన్ కానుక నగదు పంపిణీ పూర్తయినట్లు ఎంపీడీవో పీవీవీ ప్రకాష్ తెలిపారు. బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే వైఎస్సార్ పెన్షన్ కానుక నగదు పంపిణీ మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా గ్రామాల వలంటీర్లు ప్రారంభించారు. వీరితోపాటు గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు ఈ పెన్షన్ పంపిణీలో పాల్గొన్నారు. సిద్ధాపురంలో జగనన్న గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ నౌడు వెంకట అచ్యుతరామారావు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం నిరవధిక వాయిదా

పెదవేగి : ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి నిబంధనలను గౌరవిస్తూ మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని నిరవధిక వాయిదా వేసినట్టు పెదవేగి ఎంపీపీ తాతా రమ్యకుమార్ అన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశ హాల్‌లో ఎంపీటీసీలు, సర్పంచ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీపీ అధ్యక్షతన వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సభలో ఏ విధమైన అంశాలు చర్చించలేదని, ఎమ్మెల్సీ ఓటు వేసేందుకు ప్రజాప్రతినిధులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేసినట్లు ఎంపీపీ తెలియజేశారు. కార్యాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.